నమస్తే తెలంగాణ

కామారెడ్డి

5 | నిజామాబాద్, బుధవారం 29 మే 2024 | KAMAREDDY




సాలూరా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

# సాలూరా చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు

### ఆపరేటర్ నుంచి రూ.13,500 నగదు స్వాధీనం

బోధన్ రూరల్, మే 28: చెక్‌పోస్టుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం సాలూరా వద్ద ఉన్న తెలంగాణ – మహారాష్ట్ర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. నిజామాబాద్ జిల్లా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5గంటల వరకు తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా తమ సిబ్బందితో చెక్‌పోస్టుపై నిఘా పెట్టామని, కొన్ని వాహనాల వారు పర్మిట్ తీసుకోవడం, మరికొందరు వాహనదారులు టేబుల్‌పై డబ్బులు పెట్టి వెళ్లడాన్ని గమనించినట్లు తెలిపారు. దీంతో వెంటనే చెక్‌పోస్టును తనిఖీ చేయగా విధుల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఒక హెడ్‌కానిస్టేబుల్ మాత్రమే ఉన్నారని, ఏఎంవీఐ శ్రీకాంత్ డ్యూటీలో లేకపోవడంతో అతన్ని పిలిపించామన్నారు. చెక్‌పోస్టును తనిఖీ చేయగా కంప్యూటర్ ఆపరేటర్ వద్ద రూ.13,500 లభ్యమయ్యాయని, వాటిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ నాగేశ్, శ్రీనివాస్, వేణు తదితరులు ఉన్నారు.









కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలోని చెరువు గతేడాది ఇదే నెలలో జలకళతో నిండుకుండలా ఉన్నది. దీంతో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి చుట్టూ ఉన్న బోరుమోటర్లు నిండుగా పోసేవి. ప్రస్తుతం ఇదే చెరువు నీళ్లు లేక వెలవెలబోతున్నది. అచ్చం క్రీడా మైదానంలా కనిపిస్తున్నది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# ఖాళీ బిందెలతో రాస్తారోకో

- నాలుగు రోజులుగా తాగునీటి కోసం అవస్థలు
- ఆగ్రహంతో రోడ్డెక్కిన మహిళలు
- గంటకు పైగా నిలిచిన రాకపోకలు
- పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్య వైఖరి


> నీళ్లంటే విస్తరాకులా..
> చెట్లపై నుంచి తెచ్చి ఇవ్వడానికి..
> టైం పడుతుంది..
> వంద మంది కాదు.. వెయ్యి
> మంది వచ్చి ఖాళీ బిందెలతో
> కూర్చున్నా నేనేం చేయలేను..

ఇవి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరిన ప్రజలతో పంచాయతీ కార్యదర్శి మాట్లాడిన మాటలు.

నాగిరెడ్డిపేట, మే 28: తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతూ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీవాసులు మంగళవారం ఖాళీ బిందెలతోబోధన్– హైదరాబాద్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంట పాటు ప్రజలు నిరసన తెలపడంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. కాలనీకి చెందిన బోరుమోటర్ చెడిపోయి నాలుగు రోజులుగా తాగునీరు రావడం లేదన్నా రు. తాగునీటి ఇబ్బందులపై పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యను అడిగితే స్పందించడం లేదని.. దీంతో తాగునీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.

### నీళ్లంటే విస్తరాకులా..

ఆందోళన చేస్తున్న ప్రాంతం నుంచి పోలీసులు పంచాయతీ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య మాట్లాడుతూ నీళ్లంటే ఇస్తరాకులా.. చెట్లపైన నుంచి తెచ్చి ఇవ్వడానికీ.. టైం పడుతది..వంద మంది కాదు.. వేయ్యి మంది ఖాళీబిందెలతో వచ్చి రోడ్డుపై కూర్చున్నా నేనేం చేయలేను.. అంటూ దురుసుగా మాట్లాడి కాల్ కట్ చేశాడు. ఇది విన్న ప్రజలు ఆగ్రహంతో పంచాయతీ కార్యదర్శి తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యదర్శి వచ్చి సమస్య పరిష్కరించేవరకు రోడ్డుపై నుంచి లేవమంటూ భీష్మించుకూర్చోవడంతో పోలీసులు మళ్లీ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసినట్లు వారు తెలిపారు. దీంతో పోలీసులు ప్రజలను సముదాయించి రోడ్డుపై నుంచి పక్కకు తీసుకువెళ్లడంతో అక్కడి నుంచి వారు ఎంపీడీవో కార్యాలయం చేరుకొని ధర్నా చేశారు. పోలీసులు విషయాన్ని డీఎల్‌పీవో సురేందర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. బుధవారంలోగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించి వెనుదిరిగారు. స్థానికంగా ఉండకుండా విధుల్లో దురుసుగా ప్రవర్తిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో బుధవారం మళ్లీ రాస్తారోకో చేపడతామని ప్రజలు హెచ్చరించారు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సాయినగర్ కాలనీవాసులు

## బోరుమోటారుకు మరమ్మతులు



నాగిరెడ్డిపేట, మే 28: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో బోరుమోటారును నాయకులు బాగు చేయించారు. ఉదయం కాలనీవాసులు చేపట్టిన రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బోరును బాగు చేయించి కాలనీలో నీటిసమస్యను పరిష్కరించారు.

## 31న కామారెడ్డి వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక

కామారెడ్డి రూరల్, మే 28: కామారెడ్డి మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఎన్నికను ఈ నెల 31న నిర్వహించాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు ఆ రోజు బల్దియా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న నిట్టు జాహ్నవిని ఇటీవల అవిశ్వాస తీర్మానం ద్వారా పదవి నుంచి దించేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15న నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఇందుప్రియను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ నెల 31న బల్దియా సమావేశం ఏర్పాటు చేయాలని ఈసీ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆ రోజు వీలు కాని పక్షంలో మరుసటి రోజు సమావేశం నిర్వహించి ఎన్నిక చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నది.

## 'ఉపాధి' పనులు చేస్తుండగా గుండెపోటు

### -వృద్ధుడి మృతి



అంబల్ల మల్లయ్య(ఫైల్)

భిక్కనూరు, మే 28: ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో కూలీ మృతి చెం దిన ఘటన భిక్కనూరు మండల కేంద్రం లో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అంబల్ల మల్లయ్య (66) భిక్కనూరు కర్లోని కుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు ఉద యం వెళ్లాడు. ఎప్పటి లాగే తోటి కూలీలతో కలిసి పనిచేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో అక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి కలిసి మల్లయ్యను కామారెడ్డి దవాఖానకు తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మల్లయ్య మృతదేహాన్ని ఎంపీడీవో, ఏపీవో పరిశీలించారు.

# కౌంటింగ్ సజావుగా నిర్వహించాలి

### రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 28: నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సీఎంసీలో జూన్ 4న నిర్వహించే పార్లమెంట్ ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పలువురు సిబ్బంది సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు అంకితభావంతో పనిచేయాలని, అనుమానాలు, గందరగోళానికి తావిచ్చేలా వ్యవహరించొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తేవాలని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మపరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలకపాత్ర పోషించాల్సి ఉం టుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డీపీవో చక్రవర్తి తరుణ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి

ఖలీల్‌వాడి, మే 28: అసెంబ్లీ ఎన్నికల సభలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందిన కాంగ్రెస్ మరోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారని, ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసేందుకు విధివిధానాల కోసం కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక వర్గాలకు న్యాయపరమైన డిమాండ్ల సాధనకోసం తెలంగాణ ఉద్యమ తరహా పోరాటానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీ కుల సంఘాలు, బీసీ జనసభ తలపెట్టిన జూన్ 8న మహాధర్నా, 15న సెక్రటేరియట్ ముట్టడికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బుస్సా ఆంజనేయులు, మహేశ్, మహిపాల్ యాదవ్, శ్రీధర్, లింగం పాల్గొన్నారు.

# నిందితులపై చర్యలు తీసుకోవాలి

వినాయక్‌నగర్, మే 28: మహిళల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న నిజామాబాద్ నగరంలోని పోచమ్మ గల్లిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సెంటర్ ఎదుట మహిళా సంఘాలు ధర్నా చేశాయి. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మాట్లాడుతూ పోచమ్మగల్లీలోని అయ్యప్ప డయాగ్నోస్టిక్ సెంటర్‌లో కంప్యూటర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నీలిప్రసాద్ మహిళల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు ఈ నెల 8న తమకు ఫిర్యాదు వచ్చిందని, కేసు నమోదు చేసుకొని ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు షోకాజ్ నోటీసు

ఖలీల్‌వాడి, మే 28: అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నలుగురు వైద్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించినట్లు డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ తెలిపారు. కమిటీలో జీజీహెచ్ గైనిక్ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ అనుపమ, అసిస్టెంట్ ప్రొఫెసర్(రేడియాలజీ) జీజీహెచ్ డాక్టర్ శ్రావణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, ఎంసీహెచ్ సర్వీసెస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య ఉన్నారు. వీరు ఏడు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందించనున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- విత్తనాల కోసం రైతుల పాట్లు

# పాత రోజులొచ్చాయి..

*భీమ్‌గల్, మే 28: నిజామాబాద్ జిల్లాలో విత్తనాల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పదేండ్ల కిందటి దృశ్యాలు మళ్లీ కనిపిస్తున్నాయి. విత్తనాల కోసం పదేండ్ల కిందట పట్టా పాస్ పుస్తకాలు, చెప్పులు క్యూలో పెట్టిన విధంగానే ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భీమ్‌గల్ పట్టణంలోని నందిగల్లీ పీఏసీఎస్ గోదాము వద్ద జీలుగ విత్తనాల కోసం మంగళవారం రైతులు పట్టా పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలను లైన్‌లో పెట్టి ఉదయం నుంచి పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో క్యూలో నిలబడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.*





భీమ్‌గల్‌లో జీలుగ విత్తనాల కోసం పట్టాపాస్‌బుక్, జిరాక్స్ కాపీలను లైన్‌లో పెట్టిన రైతులు